తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# నా భార్య మరణానికి కారణమైన వారిని శిక్షించండి!

పెళ్లకూరు జూలై 4 ప్రభాతవార్త : మండలంలోని పునబాక (రైస్ మిల్) గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన అమాస దుర్గ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో భర్త అనారోగ్యం దృష్ట్యా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని మొదట బంధువులు కుటుంబ సభ్యులు భావించారు. గురువారం నాడు సిమ్స్ హాస్పిటల్ నుంచి దుర్గ మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకుని వచ్చి దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసుకుంటుండగా గ్రామంలో ప్రజలు దుర్గను పునబాక గ్రామానికి చెందిన నీలం సుబ్బయ్య భార్య మస్తానమ్మ తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకుందని, కుమారుడితో కలిసి ఇంటికెళ్లి అవమానపరిచి కొట్టడంతో ఈ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు చర్చించుకోవడంతో జరిగిందని సమాచారం. ఇది తెలుసుకున్న బంధువులు కుటుంబీకులు ఆగ్రహావేశాలతో వెంటనే దుర్గ మృతదేహాన్ని తీసుకొని పెళ్లకూరులోని జాతీయ రహదారిపై



పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బంధువులు

బైఠాయించి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. దుర్గ మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి గిరిజనులమైన మాకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ విషయంలో దుర్గ మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని సీఐ సంగమేశ్వర రావు హామీ ఇవ్వడంతో శాంతించిన బంధువులు కుటుంబీకులు అక్కడి నుంచి దుర్గ మృత దేహాన్ని తీసుకుని వెళ్లారు.

# బిసీ రుణాల కోసం నిరీక్షణ

- మెగా చెక్కులు ఇచ్చి చేతులు ఎత్తివేసిన ప్రభుత్వం

- బ్యాంకుల చుట్టూ సబ్సిడీ రుణం కోసం లబ్దిదారులు ప్రదక్షిణ
- రుణాలు మంజూరు చేయని బ్యాంకులు




చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త: గత వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్ళపాటు బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఎవ్వరికి మంజూరు చేయకపోవడంతో నిరాశతో వున్న బిసీలకు రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం బిసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పడంతో సంబరపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్లే నాలుగు నెలల క్రితం బిసీ నిరుద్యోగ అభ్యర్థుల నుండి సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఆపై అధికారులు బ్యాంకర్లతో కలిసి రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి రుణం మంజూరుకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలు ముగియడంతో ఎంపికైన అభ్యర్థులు ఇక బ్యాంకులు రుణం మంజూరు చేస్తుందని ఆశలు పెట్టుకున్నారు. అయితే బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేసి మూడు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క లబ్దిదారుడికి బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణంను బ్యాంకులు మంజూరు చేయలేదు. జిల్లాలో బ్యాంకర్లు, అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి రుణాల కోసం ఎంపిక చేసిన లబ్దిదారులను ఏప్రిల్ 11వ తేదీ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు 535 మంది లబ్దిదారులకు 11.58 కోట్ల రూపాయల మెగా చెక్కును అందించారు. బహిరంగ కార్యక్రమంలో లబ్దిదారులకు మెగా చెక్కును పంపిణీ చేయడంతో ఇక నేరుగా బ్యాంకులు వెళితే రుణం విడుదల అవుతుందని భావించిన లబ్దిదారులకు బ్యాంకుకు వెళ్ళి బిసీ సబ్సిడీ రుణం మంజూరు చేయాలని అడిగిన వారికి నిరాశే ఎదురవుతుంది. బిసీ సబ్సిడీ రుణం మంజూరు చేయడానికి ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని దీంతో ఇప్పటికిప్పుడు సబ్సిడీ రుణం మంజూరు సాధ్యం కాదని బ్యాంకర్లు లబ్దిదారులకు తేగేసి చెప్పుడటంతో వారు ఖంగు తింటున్నారు. గతంలో బ్యాంకులు ఎంపిక చేసిన లబ్దిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తే ప్రభుత్వం లబ్దిదారులకు చెల్లించాల్సిన సబ్సిడీని ఆపై బ్యాంకులకు విడుదల చేసేది. అయితే ఈ సారి ప్రభుత్వం ముందుగా సబ్సిడీ విడుదల చేస్తామని ఆపై బ్యాంకులు లబ్దిదారులకు రుణం మంజూరు చేయాలని చెప్పడంతో ఇప్పటి వరకు ఏ ఒక్క బ్యాంకు లబ్దిదారులకు రుణం మంజూరు చేయలేదని తెలుస్తోంది. ప్రభుత్వం బిసీ సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పినప్పటి నుండి ఆ సబ్సిడీ రుణంతో ఏదేని వ్యాపారం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయవచ్చునని ఇంటర్వ్యూల్లో అధికార పార్టీకి చెందిన నాయకులను ప్రసన్నం చేసుకుని రుణం కోసం ఎంపికైన లబ్దిదారులు నాలుగు నెలలుగా బ్యాంకులు బిసీ సబ్సిడీ రుణం మంజూరు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం బిసీ సబ్సిడీ రుణం మంజూరు చేయలేదని ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే బిసీ సబ్సిడీ రుణం మంజూరు చేస్తోందని ఆశలు పెట్టుకుంటే ఈ ప్రభుత్వం అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి వారిని వడపోసి లబ్దిదారులను ఎంపిక చేసి చివరికి బ్యాంకు వద్దకు వెళితే ఇప్పట్లో రుణం ఇవ్వడం కుదరదని చెప్పడంతో ఈ ప్రభుత్వం ఇలా చేస్తే ఎలాగని సబ్సిడీ రుణాల కోసం ఎంపికైన లబ్దిదారులు ప్రభుత్వంను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిసీ సబ్సిడీ రుణాలకు ఎంపికైన లబ్దిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## పార్టీ పదవుల కోసం...

# తిరుపతి నేతల కుస్తీ !

-ఇన్‌ఛార్జి బాధ్యతలపై తాపత్రయం
-పార్లమెంట్ అధ్యక్ష పదవిపై కొందరు ఆశలు

**ప్రభాతవార్త -తిరుపతి:**



"ఉట్టికెక్కలేని అమ్మ స్వర్గానికి ఎగురునా?" అన్నట్లు తిరుపతి తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో పదవుల కోసం తాపత్రయం మొదలైంది. ఓ వైపు సీనియర్‌లకు క్రియాశీలక నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తుంటే మరోవైపు కొందరు పార్టీలో నేతలు తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవితోబాటు పార్లమెంట్ అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవులు అందుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేసుకొంటున్నారు. పదిమంది కార్యకర్తలను వెంట బెట్టుకుని నడవలేని నాయకులు కూడా కీలక పదవుల కోసం ప్రాకులాడటం పై కార్యకర్తలే ఆగ్రహంగా ఉన్నారు.

ఇప్పటికే తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న ఎం.సుగుణమ్మ తిరుపతిలో పార్టీని కొంతవరకు కొందరిని కలుపుకుని పనిచేస్తున్నా ఆమెకు ఇప్పటికే రాష్ట్రంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా నామినేటెడ్ పదవి దక్కింది. అలాగే తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్‌కు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని టిడిపి అదిష్టానం కట్టబెట్టింది. ఈ రెండుపదవుల్లో ఇద్దరు నేతలు అందలమెక్కడంతో పార్టీలో పదవులు కోసం కొందరు నేతలు పోటీపడతున్నారు. పార్టీ మహానాడు ముగియడం, సంస్థాగత ఎన్నికలకు సమయం రావడంతో తిరుపతి ఇన్‌ఛార్జి పదవికోసం కనీసం కార్యకర్తల బలంలేని, కష్టమొచ్చినా పార్టీకి అండగా నిలబడలేని నేతలు ముందుకు రావడంపై కార్యకర్తలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాయకుడంటే డబ్బులుంటే సరిపోదని, పదిమంది కార్యకర్తలు, ప్రజలు కష్టాలు తెలుసుకుని వెన్నంటి నిలబడిన అతనే నాయకుడని బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఓటుబ్యాంకు లేని నాయకులు కూడా పదవులు కావాలని ఆశలు పెట్టుకోవడం ఏమిటనే విమర్శలు పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో, వైసిపి నేతల విమర్శలు,ఆరోపణలకు నోరుమెదపని నాయకులు కూడా ఇప్పుడు పదవుల కోసం మంత్రులును, అదిష్టానం నాయకులను కాకాపట్టడం మంచిదికాదనే కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీ కార్యక్రమాలు చేయని నాయకులు కూడా ఇప్పుడు పదవులు పేరుతో తెరపైకి రావడం ఏంటనే వ్యాఖ్యలు తెలుగుతమ్ముళ్ళలో వినిపిస్తోంది. తిరుపతిలో పార్టీని ఒకతాటిపై నడిపించాల్సిన నాయకులు ఎవరికివారేగా విడిపోవడం విబేధాలు తలెత్తేలా చూస్తున్నారని పార్టీలో కొందరు గుప్పుమంటున్నారు. ఇప్పటికే తిరుపతిలో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, ఉన్న కార్యకర్తలను, అభిమానులను, ఓటుబ్యాంకును కాపాడుకోకుంటే పరిస్థితి చేయిదాటిపోతుందని కార్యకర్తలతో బాటు కొందరు సీనియర్ నేతలు కూడా ఆవేదన చెందుతున్నారు. పార్టీలో బలంగా ఉన్న నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తే తప్ప పార్టీ బలోపేతం కాదనేది తెలుగుతమ్ముళ్ళు నిర్మోహమాటంగా చెబుతున్నారు. అధినేత, సిఎం చంద్రబాబు దృష్టిలో పదవుల కోసం ప్రాకులాడుతున్న నేతల్ని అందలమెక్కిస్తే పార్టీకి నష్టం తప్ప మంచి జరగదనేది వాదనలు లేకపోలేదు.

# ప్రపంచ స్థాయిలో సత్తాచాటారు!

- టిటిడి ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం -టిటిడి విఎస్‌ఓలు రామ్‌కుమార్, సురేంద్రకు అభినందనల వెల్లువ



తిరుమల,జూలై 4ప్రభాతవార్తప్రతినిధి: ఆ ఇద్దరు పోలీసుశాఖకు చెందిన అధికారులు.టిటిడిలో ఎంతో కీలకమైన విజిలెన్స్‌సెక్యూరిటీ విభాగంలో విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్(విఎస్‌ఓ)లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఇద్దరు ఇటీవల అమెరికా బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025 పోటీల్లో కాంస్య,స్వర్ణ పతకాలు సాధించారు. తిరుమలలో విఎస్‌ఓ (వింగ్)నెట్టెం తులసీవెంకట రామ్‌కుమార్, విఎస్‌ఓ అల్లంసురేంద్ర 55,45 సంవత్సరాల సింగిల్ టెన్నీస్ పోటీల్లో అద్భుతంగా ఆడి సత్తా చాటారు. కాంస్యపతకాన్ని, స్వర్ణపతకం గెలుచుకున్నారు. ఈ ఇద్దరు అధికారుల ప్రతిభను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అభిమానులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

# కన్నుల పండువగా అర్జున తపస్సు



అర్జున తపస్సుమాను దృశ్యం

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్ళలో ప్రధాన ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ధర్మరాజుల స్వామి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిట లాడుతుంది. పట్టణం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా జనం తండోపతండాలుగా కదలి వస్తారు.ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అర్జున తపస్సు కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో అర్జునుని చక్కగా అలంకరించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఆలయ ఉద్యోగుల సారథ్యంలో ఉత్సవాలను సంప్రదాయాలు, సంస్కృతికి అద్దం పట్టే విధంగా తీర్చి దిద్దారు.

శుక్రవారం అర్జున తపస్సు సందర్బంగా ఆలయంలో అర్జుని ఉత్సవ మూర్తికి చక్కగా అలంకారం జరిపారు. అలంకారాల్లో సిద్ద హస్తులైన రాజేష్‌గురుకుల్ పర్యవేక్షించారు. ఆలయం నుంచి ఊరేగింపు తో ఆలయ ఆవరణలో తాటి చెట్టును ఏర్పాటు చేసారు. ఇక్కడ విశేష పూజలు, గుమ్మడి కాయను కొట్టి కర్పూర హారతులిచ్చి అర్జునుడు పాశుపతాస్త్రాన్ని చేసిన తపస్సును నిర్వహించారు. అర్జున్ పాత్రధారి చక్కగా అభినయిస్తూ, తాటిమొక్కపై నుంచి విసిరే నిమ్మకాయలతో సంతాన ప్రాప్తి కల్గుతుందనే నమ్మకం ఉండటంతో జనం ఎగబడ్డారు. కార్యక్రమాల నిర్వహణలో ఈ ఏడాది ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి, సుమతి, మల్లీశ్వరమ్మ, ఎఇఓ హేమా మాలిని డిఇఇ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్స్ రవికుమార్, ఎస్‌ఓ నాగభూషణం, ఎఇఇలు, దుర్గాప్రసాద్, దాము, సుదర్శనరెడ్డి, ఆలయ పూజారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మకాయల కోసం నిరీక్షణ, అగ్నిగుండ ప్రవేశానికి ప్రారంభమైన కంకణదారణ



ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహస్తున్న దృశ్యం

**అగ్నిగుండ ప్రవేశానికి కంకణ దారణ :**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ప్రత్యేక ప్రధాన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే అగ్నిగుండ ప్రవేశానికి మూడు రోజులు దీక్షలు ఆచరించటం ఆనవాయితి. శుక్రవారం అర్జున తపస్సు తరువాత భక్తులు అగ్నిగుండ ప్రవేశానికి సంబందించి కంకణాలు ధరిస్తున్నారు. పసుపు బట్టలు ధరించి చేతిలో వేపమండ పట్టుకొని గోవింద నామస్మరణతో మూడు రోజులు నియమాలతో కూడుకొని ఆచరిస్తారు. ఆదివారం అగ్నిగుండం ప్రవేశానికి చక్కగా ముస్తాబు చేసుకుంటారు. తలకు పూల పాగా ధరిస్తారు. ముఖానికి గంధం పూసుకొని కళ్ళకు కాటుక అద్దుకొని దర్శనమిస్తారు. ఈ ఏడాది కనీసం పది వేల మంది అగ్నిగుండ ప్రవేశం చేయవచ్చునని అంచనాలు వేస్తున్నారు.ఈ నేపథ్యలో కంకణాల రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

# అన్నదాతను అందరూ ఆదుకోవాలి : ఎంపీ




రైతులకు పనిముట్లు అందజేస్తున్న దగ్గుమళ్ళ ప్రసాదరావు

రేణిగుంట, జులై 4 ప్రభాతవార్త : ప్రజల కడుపులు నింపుతున్న అన్నదాతలను ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత అందరిపై ఉందని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగుమళ్ళ ప్రసాదరావు అన్నారు. రేణిగుంట మండలం చైతన్య పురం వనస్థలిపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు శుక్రవారం రైతులకు శిక్షణ, ఇన్పుట్స్ పంపిణీ, షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక తదితర రైతులకు బహుళ ప్రయోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, అసోసియేటివ్ డైరెక్టర్ సుమతి తదితరులు పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. రాజ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రాజశేఖర్ నాయుడు, ప్రోగ్రెసివ్ ఫార్మర్ కొండ యాదవ్,రాస్ శాస్త్రవేత్తలు, సిబ్బంది అతిథులకు స్వాగతం పలికారు. తరువాత రాస్ కృషి విజ్ఞాన కేంద్రం లోని ఎన్జీరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అన్నారు. రైతు లేకపోతే రాజ్యం లేదన్నారు. అన్నదాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాణ్యమైన దిగుమతులు సాధించడం కోసం సేంద్రీయ ఎరువులను రైతులు వినియోగించాలని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయం సంక్షోభానికి గురవుతున్న ప్పటికీ ఎన్డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి విశేషంగా కృషి చేస్తున్నదని తెలిపారు.రాస్ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు చేస్తున్న సేవలను కొనియాడారు. చివరగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా టిడిపి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తెలుగు రైతు అధ్యక్షులు నాగేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# పిఎం ఫసల్ బీమా యోజన సద్వినియోగం

- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



బీమా పథకం ఖరీఫ్-2025 పిఎం ఫసల్ బీమా యోజన పోస్టర్లను ఆవిష్కరణ

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కర్నూలు, చిత్తూరు జిల్లాలో టాటా ఎఐజి ఇన్సురెన్స్ క్లస్టర్ మేనేజర్ సాగర్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు శుక్రవారం కలెక్టరేట్‌లో పంటల బీమా పథకం ఖరీఫ్-2025 పిఎం ఫసల్ బీమా యోజన పోస్టర్లను ఆవిష్కరించారు., క్లస్టర్ మేనేజర్ సాగర్ మీడియాతో మాట్లాడుతూ తుఫాను, కరవు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులకు ఈ పథకంలో చేరడానికి అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం వార్షిక ప్రీమియం రైతు చెల్లిస్తే మిగిలిన మొత్తంను బీమా కంపెనీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. జిల్లాలో వరికి 42 వేల రూపాయలు, రాగికి రూ.17 వేలు, కందులు రూ.20 వేలు, ఒక ఎకరాకు బీమా సౌకర్యం వుంటుందన్నారు. వివరాలకు రైతులు కస్టర్ మేనేజర్ 90596 34144 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్లు ధనంజయ, టి.పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 65,451 బంగారు కుటుంబాలు గుర్తింపు

- పి4పై సీఎం కీలక సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడి

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త: జిల్లాలో ఇప్పటి వరకు 65,451 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వివరించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు అమరావతి నుండి శుక్రవారం పీ4 విధానంపై జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో పి4 విధానంలో కుటుంబాల ఎంపికపై చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 65,451 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఇందులో కొన్ని కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా కొన్ని కుటుంబాలు దత్తత కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. సిఎం ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీలోపు 1,93,424 కుటుంబాల దత్తత లక్ష్యంను సాధించడానికి చర్యలు ముమ్మరం చేస్తామన్నారు. పీ4 విధానంలో చిత్తూరు నియోజకవర్గంలో 7,953, జిడినెల్లూరు 11,573, కుప్పం 10,407, నగరి 5,135, పలమనేరు 10,106, పుంగనూరు 9,541, పూతలపట్టు 10,736 కుటుంబాలు పీ4 విధానంలో బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. పీ4 కేవలం దాతృత్వ కార్యక్రమం కాదని, గ్రామాలు స్వయంగా సమృద్ధి సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించాల్సిన అవసరం వుందన్నారు. ప్రతి ఒక్కరు సిఎం నిర్దేశించిన లక్ష్య సాధన కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసులు, జిల్లా ప్రణాళిక కార్యాలయ ఎడి బి.సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలతో మున్సిపల్ ఆదాయానికి గండి

- యథేచ్ఛగా రోడ్లపై ఫ్లెక్సీలు
- పట్టించుకోని అధికారులు



సూళ్లూరుపేట, జులై 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా ఫ్లెక్సీలను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే విధంగా కొన్ని ఫ్లెక్సీ బోర్డులకు సంవత్సరానికి నగదు నిర్ణయించి దాన్ని చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శాశ్వతంగా పట్టణంలో సుమారు 10 బోర్డులు వరకు ఉన్నాయి. వాటిపై ప్రచారం నిమిత్తం ఫ్లెక్సీలు వేస్తుంటారు. కాగా, గత కొన్ని రోజులుగా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు వేయడం పరిపాటిగా మారింది. గత మున్సిపల్ సమావేశంలో ఫ్లెక్సీలను నియంత్రించాలని, వాటిని వేసేందుకు కొంత రుసుము చెల్లించే విధంగా తీర్మానం చేశారు. కానీ, ఆ తీర్మానం ఇప్పటివరకు అమలైన దాఖలాల్లేవు. అలాగే శ్రీచెంగాళమ్మ దేవస్థానం సమీపంలో ఎటువంటి ఫ్లెక్సీలు వేయరాదని, కేవలం ఆధ్యాత్మికమైన ఫ్లెక్సీలు మాత్రమే వేసే విధంగా చర్యలు తీసుకుని అమలు చేస్తూ వచ్చారు. కానీ ప్రస్తుతం ఈ నిబంధనలు తొక్కిపెట్టి చెంగాళమ్మ గుడి సమీపంలోనూ ఫ్లెక్సీల పరంపర కొనసాగుతోంది. అలాగే పట్టణంలోని ఆర్‌అండ్‌బి రోడ్డులో హోలీక్రాస్ జంక్షన్ నుంచి చెంగాళమ్మ గుడి వరకు ఉన్న డివైడర్ల మధ్యలో విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు పెడుతున్నారు. దీంతో లక్షల రూపాయలు వ్యయం చేసి వేసిన సెంట్రల్ లైటింగ్ షార్ట్ సర్క్యూట్ అయి వెలగడం లేదు. దీనిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కొన్ని స్తంభాల్లో వెలుగులు ఇవ్వడం లేదు. దీనికి కారణం ఫ్లెక్సీలు కట్టేటప్పుడు ఉపయోగించే వైర్లు అని చెప్తున్నారు. ఈ వైర్ల వలన ఫ్లెక్సీలకు వెళ్లే విద్యుత్‌లైన్ కట్ అయి ఈ పరిస్థితి ఏర్పడుతుందని చెప్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఫ్లెక్సీలను నియంత్రిస్తే బావుంటుంది. అలాగే హోలీక్రాస్ జంక్షన్ వద్ద జాతీయ రహదారి కూడలిపై ఐ లవ్ యు సూళ్లూరుపేట అంటూ మున్సిపల్ అధికారులు నేమ్‌బోర్డు ఏర్పాటు చేసి దాని చుట్టూ గ్రీనరీకి శ్రీకారం చుట్టారు. వీటన్నింటికీ చెక్ పెడుతూ వీటిపై కూడా ఫ్లెక్సీలను యథేచ్ఛగా వేసి ఐ లవ్ సూళ్లూరుపేట బోర్డును కూడా కప్పేస్తున్నారు. అధికారులు స్పందించి మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



కుప్పంరూరల్, జూలై 4 ప్రభాతవార్త : మండలంలోని మొట్లచేను పంచాయతీలో శుక్రవారం ప్రజలు, పెన్షన్ లబ్దిదారులు సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కొత్త పెన్షన్ల మంజూరు సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్దిదారులకు పెన్షన్ల నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శశికుమార్, నేతలు సుబ్రమణ్యం, సంతానం, శివకుమార్, రాజ్‌కుమార్, శివ, గుణశేఖర్, పళని, కృష్ణప్ప, రాజు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పక్కా ప్రణాళిక ఏర్పాటు : ఎమ్మెల్యే

పలమనేరు,జూలై 4ప్రభాతవార్త:



పలమనేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి కావలసిన మౌళిక సౌకర్యాలు,అభివృద్ధిపై పక్కా ప్రణాళికలు ఏర్పాటు చేసుకుంటు ముందుకు సాగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులకు సూచించారు.స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధి రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండాలని,వచ్చే నాలుగు సంవత్సరాలలో నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయ అనుసంధాన ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అధికంగా ఆర్టికల్చర్ పై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.హంద్రీనివా నీరు త్వరలో పలమనేరుకు అందనుందని దీంతో నీటి సమస్య పూర్తిగా తగ్గుతుందని తెలిపారు.నియోజకవర్గంలో ఇరిగేషన్ పన్నులను పూర్తి చేస్తూ నూతనంగా చేపట్టవలసిన పనులకు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో అన్ని శాఖల అధికారులు నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయాలపై చర్యలు తీసుకోవాలని, 2014 నుండి 2019 వరకు పలు శాఖలలో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకున్నామని ఆగిన ఆ పనులకు తిరిగి కార్యరూపానికి తీసుకురావాలని తెలిపారు. నియోజకవర్గంలో నూతన పరిశ్రమల కల్పనకు కృషి చేస్తున్నామని పరిశ్రమల రాకతో స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి,ఆర్డీఓ భవాని,మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వివేకానంద స్వామికి నివాళులు

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా బిజెపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా చిత్తూరు వివేకానందసాగర్ కట్టపై వున్న స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంస ప్రియశిష్యుడని, వేదాంత, యోగతత్వ శాస్త్రల్లో సమాజంపై అత్యంత ప్రభావం కలిగించిన ఒక ప్రఖ్యాత అధ్యాత్మిక నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి జిల్లా కన్వీనర్ పవన్‌కుమార్, బిజెపి నాయకులు రెడ్డి మస్తాన్, అడ్వకేట్ విజయ్‌కుమార్, సన్‌షేర్, ఉదయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాల అభివృద్ధి

శ్రీరంగరాజపురం, జులై 4 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వంతో ఎస్సీ, ఎస్టీ, బిసీ, ఓసిలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు అన్నారు. డికె మర్రిపల్లి పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా! అని ఆయన తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం ఈ ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఆయన ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిడినెల్లూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్, మాజీ సర్పంచ్ గుండయ్య, మాజీ ఎంపిటిసీ వేమననాయుడు, మండల ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, బిసీ సెల్ అధ్యక్షుడు హేమాద్రియాదవ్, పైనేని మురళీ, కెంఎ రవి, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలదే పరిసరాల పరిశుభ్రత బాధ్యత

పెనుమూరు, జులై 4 ప్రభాతవార్త:

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని గంగుపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపిడిఓ పర్యటించి ఇంటింటి చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. అలాగే మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో వున్న నీటి ట్యాంకుల్లో ఇంజనీరింగ్ సహాయకుల ద్వారా నీటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, జన్మశ్రీ, విద్య తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమం

పెనుమూరు, జులై 4 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పక్కాగా అందుతున్నాయని తెలుగుదేశం నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు పేర్కొన్నారు. పెనుమూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలనీలో శుక్రవారం తెలుగుదేశం నాయకుడు పి.కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కృష్ణమూర్తినాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలిసి సంక్షేమ పథకాల జాబితాను అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నప్పటికీ ప్రజా సంక్షేమం దృష్టిలో వుంచుకుని సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకుడు యువరాజు, నాయకులు బాలాజీ, ప్రేమ్‌కుమార్‌నాయుడు, నరేష్‌కుమార్ యాదవ్, మురళి, బాబు సాహెజ్ సురేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్‌లో సాఫ్ట్ స్కిల్స్ కీలకం

– అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవ సంబంధ నైపుణ్యాలను సైతం మెరుగుపరచుకోవాలని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ అన్నారు. చిత్తూరులోని ది అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో ఇంజనీరింగ్ విజయం కోసం మృదువైన నైపుణ్యాలే కీలకం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ మాట్లాడుతూ నేటి యాంత్రిక యుగంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. ఇంజనీరింగ్ అంటే కేవలం కోడ్‌లు, సర్క్యూట్‌లు, యంత్రాలే కాదని, సంబంధాలు, సంభాషణలు, సహకారము అంతే ముఖ్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ పెంచుకోగలిగిన వారే అత్యున్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌గా పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌వి రమేష్‌కుమార్ పాల్గొని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యారంగంలో మానవీయ విలువల ప్రాధాన్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్ వంటి అంశాలపై స్పష్టమైన దృక్కోణంను అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి.జగదీశన్, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఫిరోజ్‌బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ హుండీల ద్వారా రూ.1.68 కోట్లు ఆదాయం



కాణిపాకం, జులై 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం హుండీల లెక్కింపు ద్వారా 1.68 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఇఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో దేవస్థానం హుండీలను విప్పారు. ఈ సందర్భంగా 22 రోజులకు గాను 1,68,18,705 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 52 గ్రాముల బంగారం, 1.04 కేజీల వెండి ఆదాయంగా లభించింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 16,783 రూపాయలు, నిత్యాన్నదాన హుండీ ద్వారా 38,751 రూపాయలు ఆదాయంగా లభించింది. దీంతో పాటు 980 అమెరికా డాలర్లు, 33 సింగపూర్ డాలర్లు, 66 మలేషియా రింగిట్స్, 25 యుఎఇ దీనార్స్, 140 కెనరా డాలర్లు, 75 అస్ట్రేలియా డాలర్లు ఆదాయంగా సమకూరింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ సాగర్‌బాబు, టెంపుల్ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఎఇఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ధనపాల్, ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరిటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెల్లదొరలతో పోరాడిన మన్యం వీరుడు : కలెక్టర్

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారికి ఎదు రొడ్డి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం చేశారని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవంలో పాల్గొని ఆయన చిత్రప టానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ బాణం అల్లూరి : ఎస్పీ

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు విప్లవ బాణంగా వుండి పోరాటం సాగించారని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలుగుతల్లికి గర్వకారణమైన అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకుంటున్నామని, దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో చిరస్థాయి నిలిచిన వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాష, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఆర్‌ఐలు సుధాకర్, చంద్రశేఖర్, జిల్లా పోలీసు కార్యాలయ ఎఓ నాగభూషణమ్మ, ఎఓ దస్తగిరి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 36 మందికి రెండవ తరగతి మేజిస్ట్రేట్ 90 వేల రూపాయల జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు 6 మంది పట్టుబడగా వారికి మేజిస్ట్రేట్ 60 వేల రూపాయలు జరిమానా విధించగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ 30 మంది పట్టుబడటంతో వారిని శుక్రవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిస్తే వారికి 30 వేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పక్కాగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడుతాయన్నారు.

## పెన్షన్లతో పేదలకు పండగ తెచ్చిన సిఎం చంద్రబాబు

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం – కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ!!



కుప్పం, జూలై 4 ప్రభాతవార్త : పేదలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లతో సిఎం చంద్రబాబునాయుడు పండగ తెచ్చారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం మున్సిపాలిటీకి కొత్తగా మంజూరు చేసిన 375 పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు కల్పించడం తమ లక్ష్యమన్నారు. కుప్పాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మలచేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే కుప్పంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. కుప్పం అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. అనంతరం లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమీషనర్ శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు,మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, సురేష్,ఎంఆర్ సురేష్, సోము, జగన్,నేతలు కన్నన్, సత్యేంద్రశేఖర్, ప్రతాప్, మంజు, అప్పు, రవి, జనసేన నరేష్, బిజెపి తులసినాథ్ పాల్గొన్నారు.

## కుప్పానికి 3041 కొత్త పెన్షన్లు మంజూరు



కుప్పం, జూలై 4 ప్రభాతవార్త: నియోజకవర్గానికి సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వం కొత్తగా 3041 పెన్షన్లను మంజూరు చేసింది. దాదాపు తొమ్మిది వేల దాకా దరఖాస్తులు పెన్షన్లకు అందగా ఆరు విడతల పరిశీలనలో భాగంగా తొలివిడతగా 3041 పెన్షన్లను మంజూరు చేశారు.కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను సిఎం కుప్పం పర్యటనలో లాంఛనంగా ప్రారంభించగా శుక్రవారం నుంచి నాలుగు మండలాలు, మున్సిపల్ పరిధిలో లబ్దిదారులకు కూటమి నేతలు పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు.

## సమిష్టిగా పార్టీని బలోపేతం చేద్దాం

– చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత పిలుపు

శ్రీరంగరాజపురం, జులై 4 ప్రభాతవార్త:

శ్రీరంగరాజపురం మండలంలో తెలుగుదేశం పార్టీని సమిష్టిగా బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత పిలుపునిచ్చారు. ఎస్ఆర్ పురం మండల తెలుగుదేశం కార్యాలయంలో శుక్రవారం చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుని గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. పార్టీలో చిన్న సమస్యలు వస్తుంటాయని, వాటిని సర్ధుకులు అందరు కలిసికట్టుగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కంకణం కట్టుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, నాయకులు కుమార్, గుండయ్య, కెఎం రవి, పైనేని మురళీ, మాజీ ఎంపిటిసీ వేమననాయుడు, బాబునాయుడు, కొత్తపల్లి సూరిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీవజ్ర వైష్ణవీగా అమ్మవారు-అలరించిన సౌందర్యలహరి

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త:



పుదిపట్ల స్వయంభు వష్ణవీదేవి ఆలయంలో జరుగుతున్న ఆషాడ గుప్తశ్రీ వారాహీ నవరాత్రి ఉత్సవాలు చివరి రోజు ఆషాడశుద్ధ నవమి శుక్రవారం వజ్ర వైష్ణవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆఖరి రోజున ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. ప్రధానార్చకురాలు ఉదయాన్నే అమ్మ వారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో వజ్ర వైష్ణవీగా అలంకరించారు. పుంగనూరు శ్రీనివాసులు, యశోద, చౌడేపల్లి వాసుదేవులు, రమాదేవి, తెల్లనీళ్ళపల్లి ఓబుల్‌రెడ్డి, మాలతిలు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అపరపరిపాలనా దక్షకుడు చంద్రబాబు

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త:



అపర పరిపాలనా దక్షకుడుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రకెక్కారని తేదేపా నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు (పతిరాజు), మాదిరాజు ప్రదీప్‌రాజులన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పందిళ్ళపల్లి, కాటిపేరి, దిగువపల్లి పంచాయతీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజారంజక పాలన గురించి తెలియజేసారు. రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయే పరిస్థితుల్లోనూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళులా భావించి ముందుకు తీసుకుపోతున్నారన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు, కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వివరించారు. సింగిల్‌విండో ఛేర్మన్ పగడాల హరిరాయల్, కార్తీక్, విద్యాసాగర్‌నాయుడు, మంజునాథరెడ్డి, వినోత్‌కుమార్‌రెడ్డి, గణేష్, బోయకొండ శివ, రామకృష్ణ, నాగరాజరెడ్డి, కాటిపేరి కుమార్‌రెడ్డి, నరేష్, గురు, మునిరత్నం, ఆదినారాయణ, ప్రహ్లాద, శివ, రవి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లూరి పేరుతో బ్రిటీషర్ల గుండెల్లో దడ

పుంగనూరు, జూలై 4 ప్రభాతవార్త :



విప్లవ వీరుడు, భరతమాత దాస్య సుంకలాల ఛేదన కోసం అడవి గుండెల నుంచి ఉద్భవించిన అల్లూరి సీతా రామరాజు పేరు ఇప్పటికీ బ్రిటీషర్ల గుండెల్లో దడను పుట్టిస్తూనే ఉందని బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారికి స్వాంతన చేకూర్చడం కోసం పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి హర గోపాల్ సమక్షంలో పేదలకు పాలు రొట్టె అందించారు. సీనియర్ నాయకులు మణి, మఠం బాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## షాహిన్ బస్సు ఢీ...మహిళ మృతి!

పుంగనూరు రూరల్, జూలై 4 ప్రభాతవార్త :




నిత్యం పుంగనూరు నుంచి బెంగళూరుకు అత్యంత వేగంగా ప్రయాణికులు చేరవేసే షాహిన్ బస్సు శుక్రవారం మధ్యాహ్నం టిన్ ఫ్యాక్టరీ వద్ద ఒక మహిళను ఢీకొంది. బెంగళూరుకు చెంది ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఆ మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరొకరికి కూడా తీవ్ర గాయాలు అయినట్లు తెలిసింది. అయితే గాలితో పోటీ పడినట్లు ప్రయాణించే సహిన్ బస్సు వ్యవహారంతో గతంలో కూడా చాలా ప్రమాదాలు జరిగాయి. ఏమాత్రము భద్రత లేని ఈ బస్సులో ప్రయాణించడం వల్ల పలువురు ప్రయాణికులు గాయపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. అధికారులు ఈ బస్సు వ్యవహారం గురించి పూర్తిగా విచారించాలని పుంగనూరు ప్రజలు కోరుతున్నారు.

## 178 మందికి ఉద్యోగ అవకాశాలు

పలమనేరు,జూలై 4ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 178 మందికి యువతకు ఉద్యోగ అవకాశం అందుకున్నారు.స్థానిక డిగ్రీ కళాశాలలో 20 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొన్నారు.ఈ జాబ్ మేళాకు సుమారు 489 మంది యువత హాజరు కాగా అందులో 178 మంది యువత ఉద్యోగ అవకాశాలు అందుకున్నారు.ఈ మేరకు జాబ్ మేళాకు హాజరైన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ యువతకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో భాగంగా నూతన పరిశ్రమలను రాష్ట్రానికి ఆహ్వానిస్తు న్నామని పరిశ్రమల రాకతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి,జిల్లా ప్లేస్‌మెంట్ అధికారులు చైతన్య,లోకేష్,కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకటేశులు, ఎపిఎస్ఎస్‌డిసి ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితులు లేవు

పలమనేరు,జూలై 4ప్రభాతవార్త:



వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తు వారు చేసిన తప్పులను కప్పిబుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.శుక్రవారం పలమనేరు మున్సిపాలటీ పరిధిలోని 15వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీలను చిత్తశుద్ధితో అమలు చేయడం జరుగుతుందని రాష్ట్రాభివృద్ధి కొసం తమ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని, రాష్ట్రాభివృద్ధితోనే ప్రజలు ఆర్థిక అభివృద్ధి సాధ్యమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌వి.బాలాజీ,ఆర్‌బిసి కుట్టి,గిరిబాబు,సుబ్రమణ్యం గౌడ్,నాగరాజు,ఖాజా,కిరణ్,జనసేన నాయకులు దిలీప్,హరీష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ కంచర్ల కుటుంబానికి పురంధేశ్వరి పరామర్శ

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త



ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుటుంబాన్ని శుక్రవారం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పరామర్శించారు. గత నెలలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ త ండ్రి కంచర్ల రామయ్య పరమపదించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమె కందుకూరులో కంచర్ల నివాసానికి విచ్చేసి కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

## గందరగోళంగా సాగిన గ్రామసభ... సభ ఆద్యంతము రచ్చ రచ్చే...

రేణిగుంట జూలై 4 ప్రభాతవార్త రేణిగుంట పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన గ్రామసభ ఆద్యంతము రచ్చ రచ్చగా ముగిసింది. ముఖ్యంగా రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఆర్ రావణన్, లోక్సత్తా నాయకుడు చిరంజీవి, సిపిఎం నేతలు ఓ వి రమణ, కుప్పు స్వామి, నరసింహారెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరి అడిగిన ప్రశ్నలకు ఇన్చార్జి ఎంపీడీవో ప్రభురావు, కార్యదర్శి మాధవి, సర్పంచ్ నాగేశం సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. రావణన్ పంచాయతీలు జరుగుతున్న అవినీతిపై ప్రశ్నల వర్షం కురిపించారు. సంతలో అంగళ్లు పెట్టుకున్న వాళ్ళ వద్ద ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని నిలదీశారు. పంచాయతీ ఆదాయానికి గండి కొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో సర్పంచ్, కార్యదర్శి ఆయన అడిగిన ప్రశ్నలకు మమ అంటూ సమాధానాలు చెప్పారు. గ్రామ సభలో వార్డు మెంబరు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఎం జి రెడ్డి, రమణ, గ్రామస్తులు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపాలోకి పలువురి చేరిక

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త** గుడుపల్లె మండలంకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు శుక్రవారం కుప్పం తెదేపా కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబుల సమక్షంలో గుడుపల్లె టిడిపి అధ్యక్షుడు బాబు నేతృత్వంలో వెంకటేష్, హరికృష్ణ, మూర్తి తదితరులు పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్,స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పీ4 లోగోను ఖరారు చేసిన సీఎం చంద్రబాబు

– వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్



**తిరుపతి కలెక్టరేట్, జూలై 4 ప్రభాతవార్త :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న పీ 4 విధానంపై కీలక అడుగులు పడ్డాయి. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం శుక్రవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగింది. రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ జనరల్ బాడీ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా ప్రతినిధులు, జిల్లా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు. పీ 4 స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సీఎం జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. తద్వారా రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని స్థాపిద్దాం అనే కాన్సెప్ట్‌తో ప్రజల్లోకి పీ4ని తీసుకెళ్ళాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు.

## ఘనంగా పరాశరేశ్వరునికి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, జూలై 4 ప్రభాతవార్త :



టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ చివరిరోజు శుక్రవారం ఉదయం 11గంటలకు చక్రస్నానం చేశారు. విశేషపూజలను నిర్వహించిన తర్వాత చక్రస్నానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి ధ్వజ అవరోహణంతో ఉత్సవాలను ముగించారు. భక్తులకు టిటిడి అధికారులు అన్నప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రికి తగ్గ తనయుడని అనిపించుకుంటా.




.రేణిగుంట జులై 4 ప్రభాతవార్త తన తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కి తగ్గ తనయుడని అనిపించుకుంటానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నొక్కి వక్కాణించారు. సుపరిపాలనలో తొలి అడుగు నందు భాగంగా శుక్రవారం రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. వీరికి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముందుగా అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి దగ్గరుండి బాలింతలకు ముత్తైదువుల ద్వారా సీమంతం నిర్వహింపజేసి వారికి ప్రభుత్వం సమకూరుస్తున్న పౌష్టికాహారాన్ని ఇచ్చారు ఆ తరువాత కొంతమంది చిన్నారులకు అన్నప్రాసన, మరి కొంతమంది పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. తాను చేస్తున్న ప్రజోపకరమైన కార్యక్రమాలు గత ప్రభుత్వానికి చెంపపెట్టుగా అభివర్ణించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ కార్యాచరణకు అనుగుణంగా ప్రతి గ్రామంలో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి సహకారంతో తుడా నిధులను మంజూరు చేయించి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వచ్చే నెల ఎన్ని అవాంతరాలు అడ్డువచ్చిన శ్రీకాళహస్తి స్కిట్ కాలేజీని పునః ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, స్థానిక టిడిపి సీనియర్ నేతలు కాపీ రెడ్డి నాదముని రెడ్డి, ముచ్చెలి భాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మునుస్వామి నాయుడు, పుష్పనాదం, బుజ్జి నాయుడు, శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానం చైర్మన్ పాడి రాజేంద్ర, అడ్వకేట్ ఉదయ భాస్కర్ రెడ్డి, బిజెపి యువ నాయకులు వెంకటాద్రి యాదవ్, భాస్కర్ యాదవ్, అగ్రహారం భాస్కర్ రెడ్డి, వెంకటేష్ చౌదరి, సూరిబాబు, రేణిగుంట పట్టణ యూత్ నాయకులు రేణిగుంట వార్డ్ మెంబర్ ఎంజి రెడ్డి, బుల్లెట్ రాజు, సోము, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రభురావు, రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, వెంకటాపురం ఇన్చార్జి కార్యదర్శి రమేష్, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు సానుభూతిపరులు ప్రజలు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న ఇంటర్వ్యూలు

తిరుపతి విద్య జూలై 4 ప్రభాత వార్త

ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపకులకు ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఈనెల ఒకటో తారీఖు నుంచి జరుగుతున్న ఇంటర్వ్యూలు శనివారంతో ముగియ నున్నాయి. ఇప్పటి వరకు పలు విభాగాలకు చెందిన 200మంది అకడమిక్ కన్సల్టెంట్లు ఇంటర్వ్యూలకు హాజరై వర్సిటీ అధికారులు,కమిటీ ఎదుట సంబంధిత సబ్జెక్టులపై డెమో ఇచ్చారు.శనివారం మరో 51మంది అధ్యాపకులు ఇంటర్వ్యూలను ఎదుర్కొనున్నారు.

## పురవీధుల్లో సవ్యసాచి

శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలో సవ్యసాచి భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో చివరి మూడు రోజుల ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆలయం నుంచి అర్జునుని ఊరేగింపుకు సిద్ధం చేశారు. ఉత్సవంతో పాటు పూజారి దయానందం, ఉత్సవాల ఇన్చార్జిలు లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్లు వెంట వచ్చారు.ఈ ఏడాది ఉత్సవాల్లో ఇఒ డి.బాపిరెడ్డి ఆదేశాల మేరకు లక్ష్మయ్య ముందుగానే సమయ పాలనకు సంబంధించి ఆదేశించారు. శుక్రవారం ఆయన సవ్యసాచికి పూజలు నిర్వహించి ఊరేగింపుకు సాగనంపారు. అంతేకాక అలంకారానికి సంబంధించి పూల సరఫరా చేసే కాంట్రాక్టర్లకు కూడా సూచనలిచ్చారు. దాంతో ప్రతి రోజూ ఉత్సవం సమయపాలనతో వస్తుండటంతో భక్తులే కాకుండా స్థానికులు దూరప్రాంతాల నుంచి వచ్చే శివభక్తులు కూడా దర్శించుకుంటున్నారు.చిన్న ఆలయాల ఇన్చార్జి లక్ష్మయ్య,దుర్గాప్రసాద్ దఫేదార్లు ప్రతి ఉత్సవానికి ముందుండి సాగిస్తున్నారు.అర్చకులు పురుషోత్తం తులసిలు హాజరయ్యారు.

## తీసుకున్న అప్పు తీర్చాలనే వారికే మంచి భవిష్యత్తు

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త:



ముస్లింలు తీసుకున్న అప్పును తీర్చాలనే లక్ష్యం ఉండాలని అలాంటి వారికి అల్లాహ్ ఒదుగు ఇస్తాడని నాటి ప్రవక్తలు తాము అప్పులేకుండా వరం ప్రసాదించాలని కోరుకున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ అన్నారు. నేడు మనం అప్పులు చేయటమే తప్పు తీర్చాలనే దిశగా ఉండటం లేదన్నారు. మన ప్రవక్తల్లో సత్యసంధతకు నిలువుటద్దంగా భావి తరాలకు మార్గదర్శకులుగా ఉన్న ప్రవక్తలు తన ప్రార్థనల్లో సత్యమార్గంలో నడచుటకు వరమివ్వమని ప్రార్థించారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ వివరించారు. జామియా మస్జిద్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలకు విశేష సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరయ్యారు. సకల సుఖాలు,అవకాశాలు కల్పించి అనుభవిస్తూ తనను ఆరాధించాలని ఆదేశించారన్నారు. సత్యమార్గాన నడుస్తూ పరోపకారమే పరమావధిగా జీవితం సాగించాలని నిత్యం ఆరాధనలో గడపాలని సూచించారు.

## చెట్లను నాటండి ప్రకృతిని కాపాడండి

తొట్టంబేడు,జూలై 4 ప్రభాతవార్త :



మండలం పెద్దకన్నలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెట్లు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, ఉపాధ్యాయులు దుర్గా ప్రసాద్, నాగేశ్వర్ నాయక్, శివరంజనిలు సారథ్యలో పాఠశాల ఆవరణలో సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ సారథ్యంలో 200 మొక్కలను నాటారు. ఈ ఆర్యక్రమాల్లో శివరంజని, లక్కి, గుర్రప్ప, చెంగల్రాయులు, హేమంత్,సుకుమార్, దేవ, లోకేష్, ఢిల్లి, మౌళి,ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తొలి అడుగు సంబరాలు

శ్రీకాళహస్తిరూరల్,జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు తెలుగు తమ్ముళ్ళు సంబరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు సారథ్యంలో మంగళపురి, ముచ్చివోలు పంచాయతీ పరిధిలో నిర్వహించారు. ఈ ఒరెండు పంచాయతీలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అందించిన అభివృద్ధిని వివరించారు. మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుటకు పారిశ్రామికంగా తీర్చి దిద్దుతున్న యువ నాయకుడు సుధీర్రెడ్డి అని వివరించారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఏడాదిలో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్న సుధీర్రెడ్డి పథకాలను వివరించారు. అలాగే ఈ ప్రాంతాల్లో సామాజిక సమస్యలను వినతి పత్రాలు స్వీకరించారు.ఈ కార్యక్రమాల్లో రంగినేని చెంచయ్య నాయుడుతో పాటు జడ్పిటిసి సుబ్బారెడ్డి, పాపిరెడ్డి,కామేష్యాదవ్, కృష్ణ యాదవ్, రవీంద్రారెడ్డి, జగదీశ్వర్రెడ్డి రేవిల్ల రమేష్, సుభాషిణి, సుబ్రమణ్యం నాయుడు, కృష్ణారెడ్డి, నరసయ్య,రమేష్నాయుడు, వెంకటయ్య, ,కృష్ణం నాయుడు, వెంకటసుబ్బారెడ్డి, మల్లి, పెంచుల్రెడ్డి, చాలమారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టాభూములు అనధికారికి ఆక్రమణలు: పోలీసుల పరిశీలన

తొట్టంబేడు,జూలై 4 ప్రభాతవార్త



మండలంలోని చిట్టత్తూరు రెవెన్యూ పరిధిలోని రామలింగాపురం గ్రామంలో ఓ రైతుకు సంబందించిన పట్టా భూములను ఆక్రమంగా ఆక్రమించుకుంటూ లే అవుట్లు వేస్తున్నారనే ఫిర్యాదులతో తహశీల్దార్ ఆదేశాలతో పోలీసులు పరిశీలనలు జరిపారు. శుక్రవారం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 216/9లో ఉన్న పట్టాభూమి 60 సంవత్సరాలుగా ఓ రైతు కుటుంబం పరిధిలో ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూముల్లో కారాకొల్లుకు చెందిన కొందరు ఆక్రమించుకొని దొంగచాటుగా బాట ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని తహశీల్దార్ భారతికి పిర్యాదు అందింది. ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తెప్పించుకొని తమ అనుమతి లేకుండానే రోడ్డు నిర్మాణానికి పూనుకుంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసారు. గతంలో ఇదే భూ వివాదారినికి సంబంధించి 2025మేలో వి.నిర్మల అనే రైతు ప్రాణాలు కొల్పోయిందన్నారు. అయితే సంబందిత రెవెన్యూ అధికారులు స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు భూమికి సంబందించి ధనంజయులునాయుడు ఫిర్యాదు చేయగా ఆమె స్పందించారు. వెంటనేపోలీసులను పంపి నివేదిక కోరారు.

## శ్రీకాళహస్తిలో వంగవీటి రంగా జయంతి

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త :



శుక్రవారం వంగవీటి రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కాపు సామాజిక వర్గానికి చెందిన వారు జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఓ చోట, సిద్దులు గారి ప్రసాద్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వంగవీటి రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మోహన్రంగా గతించి దశాబ్దాలుగ దుస్తున్నా నేటకి ఆయన సేవల్ని గుర్తించుకొని సంబరాలు జరుపుకుంటున్నారంటే ఆయన కాపు సామాజిక వర్గానికి నిరుపేద కార్మికుల పట్ల చూపిన సేవే గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ కోలా గోవర్ధన్, మాజీ టౌన్బ్యాంకు చైర్మెన్ డివి నారాయణ, కాపు సామాజిక వర్గానికి చెందిన అంజూరు వెంకటేస్బాబు, సిద్దులుగారి జయబాబు, ఉప్పుకృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, పూడి రవి, చిలకా గోపి,పగడాలరాజు, చింతామణి పాండు,కంటా ఉదయ్కుమార్ సూరాగారిరమేష్, సురేష్, సాదన మునస్వామి, మున్నారాయల్, బుల్లెట్ శ్యాం, చక్రాల మురళి, శ్రీపురం సుదాకర్,ఉత్తరాది శరవణ కుమార్ వల్లం గోపి, చిరంజీవులు, మొగరాల గణేస్, అంజూరు కృష్ణ, వేలూరు రమేష్, అంజూరు వెంకీ, గంగాదరం, జనార్ధన్, బాలాజి, మదురసతీష్, కంద్రిగ భాస్కర్,పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే

తొట్టంబేడు,జూలై 4 ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పెద్ద కన్నలి గిరిజన కాలనీలో కార్యక్రమాలను చేపట్టారు.పార్టీఅధ్యక్షుడురావిళ్ళ ముని రాజానాయుడు సారథ్యంలో కార్యక్రమాలను రూపొందించారు.ఈ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. రైతుల సంక్షేమానికి చెరువును బాగు చేస్తున్నామన్నారు. గిరిజనులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో మునిరాజానాయుడుతో పాటు మాజీ జడ్పిటిసి వెంకటాచలం, కన్నలి ప్రతాప్రెడ్డి, ప్రసాద్నాయుడు,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రిక్రూట్మెంట్పై అవగాహన

తిరుపతి విద్య, జూలై 4 ప్రభాతవార్త:




శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఇండియన్ ఆర్మీ రిక్రూట్మెంట్ పై అవగాహనా సదస్సు జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.బి సత్య నారాయణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేజర్ అమర్దీప్ కుమార్ విద్యార్థులకు ఆర్మీ గురించి, ఆర్మీలో ఉన్న వివిధ విభాగాల గురించి,ఆర్మీలో చేరడానికి కావలసినటువంటి కనీస అర్హతను గురించి,చేరిన తరువాత పొందే ప్రయోజనాలను గురించి చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర,ఫ్లైట్ లెఫ్టినెంట్ పి.ఉదయ, లెఫ్టినెంట్ పి.హరీష్ రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లూరి...తెలుగు జాతికి గర్వకారణం : మాజీ మంత్రి రోజా



విజయపురం, జూలై 4 ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు భరత మాత ముద్దు బిడ్డ అని, బ్రిటీష్ వారిపై ఆయన చేసిన స్వాతంత్ర పోరాట స్ఫూర్తి ఈ తరానికి చిరస్మరణీయమని మాజీ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. దేశంలో తొలిసారి బ్రిటీష్ తెల్ల దొరలపై సాయుధ పోరాటం చేసిన అల్లూరి తెలుగు వారు కావడం తెలుగు జాతికి గర్వకారణమని పేర్కొన్నారు. అల్లూరి 120వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పాడేరులో 22 ఎకరాల్లో అల్లూరి మ్యూజియం నిర్మిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ రిపోర్ట్స్పై రివ్యూ

తిరుపతి హెల్త్, జూలై 4 ప్రభాతవార్త :



మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ రిపోర్ట్స్ పై రివ్యూపై శుక్రవారం తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆశ యాప్, కిల్కారి, మొబైల్ అకాడమీ గురించి, జీరో డెలివరీస్, ఏబీహెచ్ఏ ఐడీలు, చైల్డ్ మ్యారేజెస్ టీనేజ్ ప్రెగ్నెంట్స్ గురించి ప్రజల్లో విస్తరామైన అవగాహన కల్పించాలని ఆశ నోడల్ ఆఫీసర్కి సూచిస్తూ వన్బై వన్ రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డాక్టర్లు, ఆశ నోడల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహన రంగా జయంతి

తిరుపతి హెల్త్, జూలై 4 ప్రభాతవార్త :



వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని స్థానిక అనంతవీధిలోని శుక్రవారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వంగవీటి మోహన రంగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం హస్తకళల ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి వంగవీటి జయంతి వేడుకలు తిరుపతిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్ వితరణ

తిరుపతి విద్య, జూలై 4 ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ కళాశాలలో 1983-87 లో సివిల్ ఇంజనీరింగ్ లో డిప్లమో చదివిన వై. సురేష్ బాబు అమెరికాలో సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు.తన తల్లి వై.గోవిందమ్మ ద్వారా 2,31,016 రూపాయల చెక్కును అందజేశారు.ఈ చెక్కు ద్వారా ఒక కంప్యూటర్ సిస్టం,రెండు మల్టీ ఫంక్షనల్ ప్రింటర్స్ మరియు స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ ల్యాబ్ నిమిత్తం ఒక అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ టెస్టర్ను కొనుగోలు చేయటం జరిగినది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వై ద్వారకానాథ రెడ్డి,సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు వారిని సత్కరించడం జరిగినది.

## చిగోరాలో పింగలి వర్ధంతి

తిరుపతి రవాణ,జూలై 4ప్రభాతవార్త:



తిరుపతి కోదండరామాలయ దక్షిణమాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతివేడుకలు జరుపుకున్నారు. అల్లూరి, పింగళి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. చిగోరా సంస్థ ప్రతినిధులు ,నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, రాయలసీమ రంగస్థలం కళాకారులు గుండాల గోపీనాధరఎడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పిఆర్ఎల్కుమార్, జయలక్ష్మి, శ్రీనివాసమూర్తి, లీలావతి,హారిక పాల్గొన్నారు.

## వివేకానందకు ఘన నివాళులు

తిరుపతి రవాణ,జూలై 4ప్రభాతవార్త:



యువతకు స్ఫూర్తిదాయకమైన స్వామి వివేకానంద అడగుజాడల్లో యువత నడిచి మంచి పేరుతీసుకురావాలని బిజెపి నాయకులు కోరారు.వివేకానందవర్ధంతి సందర్బంగా ఎస్వీమెడికల్ కళాశాల కూడలిలో ఆయన విగ్రహానికి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం,బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, శాంభోలు హరినాత్, కస్పాపద్మనాభం, మల్లారపురవి ,సుబ్రమణ్యంరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు,

## అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ.

తిరుపతి విద్య, జూలై 4 ప్రభాతవార్త:



ఎస్వీయూ గంథ్రాలయం, యూజీసీ ఇన్ ఫ్లిబ్నెట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వతేదీ వరకు క్యాలిబర్ 2025 అనే అంశంపై నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ను శుక్రవారం వీసీ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఏడు దేశాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆర్గనైజర్ ప్రొఫెసర్ కే సురేంద్ర బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆచార్య సుధారాణి,ఆచార్య చంద్రాయుడు,సైంటిస్టు డాక్టర్ వల్లభ్ ప్రధాన్, శేఖర్,రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అల్లూరిసేవలు చిరస్మరణీయం

తిరుపతి రవాణా,జూలై 4ప్రభాతవార్త :



దేశానికి స్వాతంత్ర్యం సముపార్జనకు అల్లూరి సీతారామరాజు చేసినసేవలు చిరస్మరణీయమని తిరుపతి నార్త్బెజెపి కార్యాలయంలో నాయకులు కొనియాడారు. అల్లూరిసీతారామారాజు జయంతి సందర్బంగా శుక్రవారం తిరుపతిలోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్బంగా బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, లోకప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరిసీతారామరాజు అసమాన ప్రతిభగలస్వాతంత్ర్య సమరయోధుడని అన్నారు.

## 7న జీతెలుగులో ఆటో విజయశాంతి

తిరుపతి రవాణా,జూలై 4ప్రభాతవార్త:

ఆసక్తికరమైన మలుపులు,అదిరిపోయే ట్విస్టలతో సాగే సీరియళ్ళను అందిస్తున్న జీ తెలుగులో మరో ఆసక్తికరమైన అంశంతో సరికొత్త ధారావాహిక ఆటో విజయశాంతి 7వతేదీ నుండి ప్రసారం కానుంది. కుటుంబ బాధ్యతలు, ప్రేమ,తాగ్యంవంటి భావోద్వేగాలతో అల్లుకున్న కథతో రూపొందిన ఈ ధారావాహిక సోమవారం నుండి శుక్రవారం వరకు రాత్రి 9.30 గంటలకు ప్రసారమవుతుందని ప్రతినిధి ప్రసాద్గుప్త తెలిపారు. ఈ కథ కుటుంబ బాధ్యతలు, బంధాల చుట్టే అల్లుకున్నదన్నారు. స్వామి,వర్షిణి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.

## నిరాడంబరంగా వెంకటముని జన్మదిన వేడుకలు

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరుపుకున్నారు. స్థానిక కొత్తపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం వెంకటముని పుట్టిన రోజును పురస్కరించుకుని అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల శుభాకాంక్షలు తెలియజేస్తూ దుశ్శాలువ అలంకరించి, పుష్పగుచ్ఛం అందజేసి, కేక్ కట్ చేయించారు. అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తన పట్ల చూపుతున్న ఆదరణ, అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మూడు నెలలుగా చౌక దుకాణాలలో కందిపప్పు కట్

పాకాల, జులై 4, ప్రభాతవార్త :



మండలంలో గత మూడు నెలల నుంచి చౌక దుకాణాల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ సరఫరాలో కందిపప్పు ఇవ్వటం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చౌక డిపోల నుంచి రేషన్ పంపిణీ వ్యవస్థను జూన్ నెల మొదటి రోజు నుంచి మొదలు పెట్టినప్పటికి బియ్యము చక్కెర మాత్రమే ప్రస్తుతం పంపిణీ జరుగుతోంది. చౌక దుకాణాలలో బయోమెట్రిక్ వేసిన తర్వాత ఏ ఒక్క వినియోగదారికి కూడా బిల్ ఇవ్వడం లేదు. చక్కెరపై అదనపు బాదుడు మరియు తూనికలలో తేడా యదేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపైన అధికారులు ఎవరు స్పందించకపోవడం బాధాకరం. ఫోటో

## కార్వేటినగరంలో వైభవంగా అర్జున తపస్సు

కార్వేటినగరం,జూలై 4 ప్రభాతవార్త:






కార్వేటినగరంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు గాజులకండ్రిగ గ్రామ స్తులచే మద్యాహ్నం వైభవంగా అర్జునతపస్సు కార్యక్రమం జరిగింది.ఈ తపస్సును భక్తిబావాలతో నిర్వహించారు.సంతానం కలగని మహిళలు తపస్మాన్ నుంచి వేసే నిమ్మకాయలను స్వీకరిస్తే పిల్లలు కలుగుతారనే నమ్మకంతో తపస్మాన్ చుట్టూ దీక్షబూని వుంటారు.తపస్మాన్ కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాదిమంది భక్తాదులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి హాజరయ్యారు. తెల్లవారిజామున కోనేరు నుండి తీర్థజలాలు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.నంది విగ్రహాన్ని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్తరగోగ్రహణము(అర్జునుడిచే ఆవులు మళ్లింపు),అలుగు ఉత్సవాలను ఆలయం వద్ద నిర్వహించడం జరిగింది. ఆలయప్రాంగణంలో చెన్నైకు చెందిన కన్నయ్య మనవడు ఆశ్విన్(పద్మప్రియ) అన్నదానం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మేళం రవియాదవ్, ఉపాధ్యక్షులు రవిరెడ్డి, కార్యదర్శి గౌతమ్వర్మ,కోశాధికారి లక్ష్మీపతి,ఉపకోశాధికారి సాయి రాయల్, భక్తులు పాల్గొన్నారు.

## బీసీల ఆత్మగౌరవ భరోస సభను విజయవంతం చేయండి

తిరుపతి కలెక్టరేట్, జూలై 4 ప్రభాతవార్త :



ఈ నెల 6వ తేదిన ఇందిరా మైదానంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో జరగనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని ఏపీ నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల పాటి బుజ్జిబాబు పిలుపునిచ్చారు. స్థానిక పెద్దకాపులేవుట్లోని ఎస్ఎల్ఎస్ రెసిడెన్సీలో శుక్రవారం ఆవుల పాటి బుజ్జిబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదిన ఇందిరా మైదానంలో జరిగే సభకు బీసీ రాష్ట్ర, కేంద్ర మంత్రులు హాజరై కానున్నారన్నారు. ఆదివారం మధ్యాహ్నం పూలే విగ్రహం నుంచి ర్యాలీగా బీసీ సోదర, సోదరీమణులు యువత ఇందిరామైదానానికి చేరుకుంటారన్నారు. ఈ సభలో బీసీలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడమే కాకుండా భవిష్యత్లో బీసీలు రాజ్యాధికార దిశగా అడుగులు వేయనున్నామని తెలిపారు. అనంతరం నగర మాజీ అధ్యక్షులు సిబ్యాల సుధాకర్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేంద్ర, నారాయణ, కుమార్,మధు,కమల్,వంశీ,మునికృష్ణనాయిబ్రాహ్మణసోదరులు, సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

## పేద,బడుగు బలహన వర్గాల విద్యాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

-నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర,జూలై 4 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని పేద,బడుగు, బలహీనవార్గాల విద్యాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నగరిఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించినారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ 2024వ సంవత్సరం ఎన్నికలలో టిడిపి ఇచ్చిన వాగ్దానం ప్రకారంగా చదువుతున్న అందరి పిల్లలకు తల్లికి వందనం అందజేసామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ శ్రీశైలం బోర్డు చేర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి,మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు,రాష్ట్ర యస్సి సెల్ అధ్యక్షులు ధశరధ వాసు,నాయకులు రవినాయుడు, చిట్టిబాబు, రామూర్తి నాయుడు, పరదేశి, లోకనాథంనాయుడు, బాబుయాదవ్, ఆనందరాజు, ఎజె రవికుమార్, భాస్కర్,రఘురామ్,జగన్, కోటీశ్వరరావు, మనోహార్నాయుడు, విజయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి విద్య, జూలై 4 ప్రభాతవార్త :

ఎస్వీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్,కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం వర్సిటీలో జాబ్ మేళా నిర్వహించ నున్నట్లు డైరెక్టర్ ఆచార్య మురళీధర్,కో ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుష అభ్యర్థులకు మాత్రమే జరిగే ఈ జాబ్ మేళాకు ప్రముఖ ఎంఆర్ఎఫ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. డిప్లొమా, ఏదైనా డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఈనెల 9న ఏఐటియూసీచే సార్వత్రిక సమ్మె



గూడూరు, జూలై 4 ప్రభాతవార్త : ఈనెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం అని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ గూడూరు నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహి ంచారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మె తిరుపతి జిల్లాలో ముఖ్యంగా గూడూరు పట్టణంలో కార్మిక సత్తా చాటాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ముఖ్యంగా 29 కార్మిక చట్టాలు రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం జరిగిందని ఈ లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే ఎనిమిది గంటల పని విధానం రద్దయి 10 నుండి 12 గంటలు పనిచేయవలసి వస్తుందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం రక్షణకై అలాగే పంటలకు గిట్టుబాటు ధరలపై జరుగుతున్న జూలై 9వ తారీకు జరిగే సార్వత్రిక సమ్మెను ఏఐటీయూసీ కార్యకర్తలు, కార్మిక వర్గాన్ని సమీకరించి 9వ తేదీన జరిగే ప్రదర్శనలు నిరసనలలో పెద్ద ఎత్తున పాల్గొనేలా చేయాలి అని పిలుపునిచ్చారు. అదే విధంగా జూలై 20వ తేదీన గూడూరులో ఏఐటియుసి నియోజవర్గ సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు ఎం ఆర్ పల్లి శ్రీనివాసులు, ఏఐటియూసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్ కుమార్, చిల్లకూరు సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సునీల్, భాస్కర్, వెంకటయ్య, రాఘవయ్య, నరసింహులు శెట్టి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## టిడిపి కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు!



దొరవారిసత్రం, జులై 7 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ కోసం ఎన్నో ఎళ్లగా కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని టిడిపి సీనియర్ నాయకులు వంక సుధాకర్ అన్నారు. శుక్రవారం దొరవారి సత్రం మండల టిడిపి మండల పార్టీ కార్యాలయం ఆవరణములో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వంకా సుధాకర్ మాట్లాడు తూ గ్రామ కమిటీలు ఏర్పాటలో మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాస నాయుడు టిడిపి కార్యకర్తలను పక్కన పెట్టి తనుకు అనుకూలమైన వైసిపి నాయకులకు కమిటీ సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నారు ఆరోపిస్తున్నారు. పార్టీలో ఎన్నికల సమయంలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రమణయ్య, మునిరత్నం సమాధి సుబ్రహ్మణ్యం, నెలవల శ్రీనివాసులు రమణయ్య తదితరులు ఉన్నారు.

## క్యాబినెట్ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



వెంకటగిరి, జూలై 4, ప్రభాతవార్త: నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో క్యాబినెట్ ఎన్నికలపై విద్యార్థులకు పాఠశాల సిబ్బంది అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. పోలింగ్ ఎలా జరుగు తుంది కౌంటింగ్ తదితర అంశాలపై వివరించారు. పదో తరగతి విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. హెడ్ వాయిస్ హెడ్ గర్ల్స్ అనే విభాగాలను ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలపై ఏజీఎం రియాజ్ వివరించారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశం అని తెలియజేశారు. ప్రజలే ప్రజా ప్రతినిధులు ఎన్నుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేష్, కోఆర్డినేటర్ రఘు, మహేష్, ఏవో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు కలిసిన తహాశీల్దార్



వెంకటగిరి, జూలై4 ప్రభాతవార్త: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహాశీల్దార్ నరసింహారావు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తహాశీల్దార్‌కు ఎమ్మెల్యే సూచించారు.

## అక్రమ కేసులు పెట్టడంలో వైసీపికే తెలుసు



వాకాడు, జూలై 4 ప్రభాతవార్త: వైకాపా ప్రభుత్వ పాలనలో టిడిపి నాయకులు పై అక్రమ కేసుల బాలాయించడంలో వైసిపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని వైకాపా నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి ఆరోపణలపై మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఖండించారు. శుక్రవారం శుక్రవారం వాకాడులో బ్యారేజీ అతిథి గృహంలో మండల కన్వీనర్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1982 టిడిపి పార్టీ ఆవిర్భావం నుండి 2024 సంవత్సరం వరకు తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో ఏ నాయకులుపై అక్రమ కేసులు బనాయించిన చరిత్ర లేదని టిడిపి పార్టీకి సంస్కారం ఉందన్నారు. 2019నుండి 24 సంవత్సరం వరకు వైకాపా ప్రభుత్వంలో టిడిపి నాయకులను ఎన్నో అక్రమ కేసులు బనాయించిన చరిత్ర ఉందని ఎద్దేవ చేశారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకో వాలని పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి ప్రమీల, మండల మాజీ కన్వీనర్ అజిత్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ద్వారకనాథ్ రెడ్డి, నాయకులు అరుణ్ కుమార్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, మోహన్ నాయుడు, శ్రీహరి, జనసేన అధ్యక్షుడు శివకుమార్, రౌతు రమణయ్య, కుంభాల రమణయ్య, రామలింగారెడ్డి, రౌతు తనుజ్ తదితరులు ఉన్నారు.

## మా బడి మాకే కావాలి



బాలాయపల్లి, జూలై4 ప్రభాతవార్త: మండలం జార్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మా పాఠశాలను గ్రామంలోని ఉంచాలని ధర్నా నిర్వహించారు. జార్లపాడు పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పిగిలాం పాఠశాలలో విలీనం చేయడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. పాఠశాల ముందు విద్యార్థులు పలకలపై మా పాఠశాలను మా గ్రామంలోని ఉంచాలని రాసి నినాదాలు చేశారు. పిగిలాం గ్రామం వెళ్లాలంటే ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాలని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. జార్ల పాడు నుండి పిగిలాం గ్రామానికి రోడ్డు కూడా బాగాలేదని తెలిపారు. జార్ల పాడు పాఠశాలను మా గ్రామంలోని ఉంచకపోతే ఆందోళన చేస్తానని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై4 ప్రభాతవార్త: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఎమ్మెల్యే నివాస గృహంలో 14 మందికి 15,60 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆస్పత్రులలో చికిత్స పొందిన పేదలందరికీ సీఎం సహాయనిధి చెక్కులను ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం పేదలను పట్టించు కోలేదని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. పేదల ఇబ్బంది పడకూడదని వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో వరుస చోరీలు!

నాయుడుపేట, జూలై 4 ప్రభాతవార్త; నాయుడుపేట పట్టణంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో మహిళలు ఒంటరిగా ఇంటి నుండి బయటకు రావాలంటే దొంగల బెడదకు హడలిపోతున్నారు. పేటలో పోలీసుల నిఘా కొరవడుతుండటంతో దొంగలు హల్‌చల్ చేస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. పట్టణంలోని బీడికాలనికి చెందిన చంద్రమ్మ బాలాజీ గ్రీన్‌సిటీ వద్ద ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు మోటార్ సైకిల్‌పై వచ్చి చంద్రమ్మ మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు సరుడును లాక్కొని అక్కడ నుండి ఉడాయించారు. అదే విధంగా నాయుడుపేటలో ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్‌చేసి వారి మెడలోని బంగారు చైన్లను లాకొని వెళ్ళిన అనేక సంఘటనలు జరుగుతున్నాయి. అంతేకాకుండ ఇటీవల కాలంలో ఇంటికి తాళాలు వేసియున్న ఇళ్ళను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో మహలక్ష్మి నగర్‌లో ఓ ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన నలుగురు వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో వచ్చి ఇంటితాళాలు పగలగొడుతుండగా పక్కింటివారు గుర్తించి పెద్దగా కేకలు వేయడంతో ఆదుండగులు అక్కడ నుండి పరారైయ్యారు. నాయుడుపేటలో ఓ ముఠా సంచరిస్తూ ఒంటరిగా వెళుతున్న మహిళలను, ఇంటికి తాళంవేసి ఉన్న ఇళ్ళలను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నేరాలను నియంత్రించే విదంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## వంగవీటి రంగా పేదల పాలిట పెన్నిధి



వెంకటగిరి, జూలై 4 ప్రభాతవార్త : దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగ పేదల పాలిట పెన్నిదని కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ తెలగ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో తూర్పు వీధిలో ఉన్నటువంటి కాపు కార్యాలయము నందు వంగవీటి మోహన రంగా 78వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు బీరం రాజేశ్వరరావు, విజయ్ కుమార్, మహేష్, గొల్లగుంట రాము, ప్రసాద్, తిరుపాలు, కుమార్, మల్లు రవి, బాలసముద్రం స్వామి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి

కోట, జులై 4 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సి పాల్ దువ్వూరు బాలకృష్ణారెడ్డి గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన ఎన్‌బికెఆర్ ప్రిన్సిపాల్‌గా 1964 నుంచి 1994 వరకు పనిచేశారు. నాలుగు దశాబ్దాలుగా ప్రిన్సిపాల్‌గా సేవలు అందించి కళాశాలకు మంచిపేరు తెచ్చారని ఎస్‌వీ సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.

## తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్న పాఠశాలను ఆపండి



గూడూరు, జూన్ 4 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియ జేయడంపై శుక్రవారం రోజు తిరుపతి జిల్లా గూడూరు మండలంలోని యం.ఇ.ఓ. డి.రవీంద్ర బాబును స్థానిక సి.ఐ.టి.యు నాయకులు కలిసి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రశ్నించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలోనికి వెళ్లి పాఠశాలలకు తమ పిల్లలను పంపమని వారి తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు చదువులు ఆపవద్దు, దయచేసి చదివించండి, పాఠశాలకు పంపించండి, అని వారికి తెలియజేయడం జరుగుతూ ఉందని, తల్లిదండ్రులు జూలై 10 వరకు గడువు కోరడం జరిగిందని, ఆయన తెలియజేశారు. ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడం తల్లిదండ్రులు చదువుకు స్వస్తి పలికి ఇంటి దగ్గరే పిల్లలను ఉంచుకోవడం జరుగుతూ ఉంది. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 6న జూనోసిస్ డే

గూడూరు, జూలై 4, ప్రభాతవార్త: జూలై 6వ తేదీ జూనోసిస్ డే సందర్భంగా గూడూరు పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి రాకుండా ఉచిత టీకాలను వేస్తామని గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు, పెంపుడు కుక్కలు, పిల్లులు యజమానులకు జంతువుల నుండి పశువులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధులు (జూనోటిక్ వ్యాధులు) గురించి అవగాహణ కల్పిస్తారన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గూడూరు, జూలై 4, ప్రభాతవార్త ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఆర్టీసీలో ఖాళీ లను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాత పద్ధతిలోనే వైద్య సదుపాయాన్ని కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం డిపో అధ్యక్షులు నారాయణలు పాల్గొన్నారు.

## అల్లూరి... అందరికీ స్ఫూర్తిదాయకం



కోట, జులై 4 ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కోట మండలం వెంకన్నపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్ రఫీ, శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు వెంకన్నపాలెం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## భూములు పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

కోట, జులై 4 ప్రభాతవార్త: మండలం కొత్తపట్నం పంచాయతీలో పరిశ్రమలకు సంబంధించిన భూములను పరిశ్రమల శాఖ పిన్సిపల్ సెక్రటరీ యువరాజ్, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పరిశీలించారు. శుక్రవారం కొత్తపట్నం పరిధిలోని ప్రభుత్వ భూములను, రికార్డులను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న క్రి సిటీ పనులను, అక్కడ మౌలిక వసతులను పరిశీలించారు. వారి వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహాశీల్దార్ కె.జయజయరావు ఉన్నారు.

## మండలంలో నేను చెప్పిందే వేదం!

పాలసముద్రం, జులై 4 ప్రభాతవార్త: పాలసముద్రం మండల రాజకీయాల్లో మళ్ళీ ముసలం ఏర్పడింది. రాష్ట్రంలో అధికారంలో కూటమి ప్రభుత్వం వున్నప్పటికీ పాలసముద్రం మండలం మాత్రం ప్రతిపక్ష వైకాపా చేతిలో వుంది. గతంలో వైకాపా అధికారంలో వున్న సమయంలో ఇక్కడ ఎంపిపి మహిళ కావడంతో ఆమె భర్త కార్యాలయంలో చక్రం తిప్పేవాడు. అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహించి తాను చెప్పిందే చేయాలని ఆదేశాలు జారీ చేసేవారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో అప్పటి వరకు అధికారంలో వున్న వైకాపా ఓటమి పాలు కావడం, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు కొంత మేరకు ఎంపిపి భర్తకు కళ్ళెం వేయగలిగారు. ఇదిలా వుండగా శుక్రవారం మళ్ళీ ఎంపిపి భర్త మరోసారి ఎంపిడిఓ కార్యాలయంలో హంగామా సృష్టించాడు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తాను చెప్పినట్లు చేయూలని హుకుం జారీ చేశారు. ఎంపిపి భర్త ఇలా చేస్తుండటంతో గతంలో హ్యూమన్ రైట్స్ నాయకులు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, జడ్పీ సిఇఓలు ఎంపిపి భర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి లేని సమయంలో ఆమె భర్త కార్యాలయంలోకి వచ్చి ఆమె ఛాంబర్లఓ కూర్చొని అధికారులకు సూచనలు జారీ చేయడంపై ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని పలువురు ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, తెలుగుదేశం నాయకులు కోరుతున్నారు.

# బీసీ హాస్టల్ ఆకలి కేకలు దారుణం : బోడే రామచంద్ర



పుంగనూరు, జూలై 4 ప్రభాతవార్త : బీసీ హాస్టల్ లలో విద్యార్థుల ఆకలి కేకలు దారుణమని, వారికి ప్రతి నెల మెస్ చార్జీలు 150, కాస్మోటిక్ చార్జీలను 500కు పెంచాలని బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయ నబీసీ సంక్షేమ సంఘం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం చేస్తున్న పోరాటానికి పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. అదేవిధంగా బీసీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు, కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలకు పెంచి బీసీ విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని, బీసీ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేయాలని, బీసీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అదేవిధంగా రాష్ట్రంలో గత పది రోజుల నుండి పలు జిల్లాలలో బీసీ హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ జరగడం వల్ల బీసీ విద్యార్థులు, విద్యార్థినిలు తీవ్ర అస్వస్థకు గురి కావడం జరిగింది. సాక్షాత్తు రాష్ట్ర హోం మంత్రివర్యులు వసతి గృహంలో భోజనం చేసే సమయంలో బొద్దింక రావడం చూస్తే రాష్ట్రంలో బీసీ హాస్టల్స్ పరిస్థితి ఏ విధంగా ఉన్నాయో ప్రభుత్వం పరిశీలించాలన్నారు, సాక్షాత్తు బిసి మంత్రి అయినటువంటి సవిత నియోజక వర్గంలో కస్తూర్బా బాలికల వసతిగృహంలో ఆహారం కలుషితమై విద్యార్థినులు అస్వస్థకు గురికావడం చూస్తా ఉంటే సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి ఏ విధంగా ఏ విధంగా దిగజారి పోయాయో రాష్ట్ర ప్రతి ప్రజలందరూ గమనించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ న్యాయమైన బీసీ హాస్టల్స్ విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించకపోతే ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘంతో పాటు బీసీవై పార్టీ కూడా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు, ధర్నాలకు, పోరాటాలకు శ్రీకారం చుడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఓ వెంకట్ యాదవ్, తిరుపతి బీసీ నాయకులు పవన్ కుమార్, ఇతర విద్యార్థి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దివ్యారామం అడవిలో మంటలు



తిరుమల, జూలై 4ప్రభాతవార్తప్రతినిధి: జిఎన్‌సి టోల్‌గేట్ సమీపంలోని దివ్యారామం నర్సరీ అటవీప్రాంతంలో శుక్రవారం ఉదయం మంటలు వ్యాపిం చాయి. ఈ నర్సరీ కాలినడక మార్గానికి ఆనుకుని ఉంది. అగ్నిప్రమాదం జరిగి మంలు వ్యాపించడంతో వెంటనే అప్రమత్తమైన అటవీశాఖ, అగ్నిమాపకశాఖ, విజిలెన్స్ సిబ్బంది అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపుచేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో...
## ఏడాది పాలన సంతృప్తికరం



తిరుమల, జూలై 4ప్రభాతవార్తప్రతినిధి: ప్రజలకు చేరువగా ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించినపుడే వారి ఆనందం అధికారులకు ఆశీస్సులని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా ఏడాది పదవీకాలం పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుపతి ప్రజలకు తనవంతు సేవచేసే భాగ్యం కలిగించడం ఆనందమన్నారు. శ్రీవారి దర్శనం చేసుకున్న కలెక్టర్‌కు ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చిలకమహాలక్ష్మీ ఆలయానికి నంద వితరణ



శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి చెందిన నంద మెడికల్స్ హోల్ సేల్ వ్యాపారి నరసింహులు (నంద) తన జన్మదిన సందర్భంగా చెన్నై రోడ్డులో వెలసిన చిలక మహాలక్ష్మీ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం అందించారు. చెన్నై రోడ్డులో చిలక మహాలక్ష్మి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆలయానికి పట్టణంలోని పలువురు సహకరిస్తున్నారు. ఈ నేపధ్యంలో శుక్రవారం నంద మెడికల్స్ అధినేత కొండూరు నరసింహులు 10,116లు విరాళాన్ని ఆలయ కమిటి సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటికి చెందిన కే.చంద్రశేఖర్‌నాయుడు, వి.రమణారెడ్డి, జి.వెంకటరామా నాయుడు, ఎం.సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు. సాధారణంగా ధార్మిక కార్యక్రమాల్లో ముందంజలో ఉన్న నందకు ఆలయ అర్చకులు ప్రత్యేకా శీర్వచనాలు అందించారు.

## శ్రీశక్తి పీఠంలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి



రామచంద్రాపురం, జూలై 4 ప్రభాతవార్త: రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠాన్ని శుక్రవారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సందర్శించారు. శ్రీశక్తి పీఠంలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, పట్టుచీర అమ్మవారికి సారెను సమర్పించారు. అనంతరం వారాహి అమ్మవారిని దర్శించుకుని మ్రొక్కులు తీర్చుకున్నారు. పీఠం పైభాగాన వెలసియున్న దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ముడుపులు కట్టారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేరానంద స్వామి, మాతాజీ రమ్యానంద భారతి ఆశీర్వాదం పొందారు.

## సత్యవేడు టిడిపి పార్టీ కో ఆర్డినేటర్‌కి సత్కారం



నారాయణవనం, జూలై 4 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో ఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్‌రెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం సాయంత్రం తిరుపతి లోని కెఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గం లోని నారాయణవనం, సత్యవేడు, నాగలాపురం, కెవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల నుంచి సుమారు 15 వాహనాల్లో 150మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి శంకర్‌రెడ్డిని భారీ గజమాల, దుశ్శాలువతో సత్కరించారు. సత్యవేడు నియోజకవర్గంలో నెలకొన్న అనిర్చితిని తొలగించడం కోసం అందరి నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీని సత్యవేడు నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడానికి శంకర్‌రెడ్డి కృషి చేయడం ఖాయమని ఆశాభావాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ నెడ్‌క్యాఫ్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, నాగలాపురం మురళి, మాజీ వైస్ ఎంపిపి టి సుబ్రమణ్యం, టిడిపి నాయకులు మాణిక్యంరెడ్డి, కెఎస్ రవి, మల్లికార్జునరెడ్డి, నాగలాపుర ం టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, బుట్టా రమేష్‌యాదవ్, టి ఊరప్ప, ఎస్‌ఎం సురేష్, శంకరయ్య. రాజశేఖర్‌యాదవ్, గాండ్ల శివకుమార్, గాండ్ల రమేష్, గాండ్ల ఆరుముగంశెట్టి, మణిరెడ్డి, బాలయ్య, దేవరాజులు, బిఎంఒ నరేష్, ఐ టిడిపి వెంకటేష్, నాగరాజు, చికెన్‌చిన్నా మురళి, రమేష్, ప్రసన్న, పిజి ముఖేష్, కె సుధాబాబు, గోవిందరాజులు, ఇంకా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు...రూ.11లక్షల బంగారు స్వాధీనం



తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త: మహిళలను టార్గెట్ చేసి వారిని వెంబడించి, మభ్యపెట్టి బంగారు నగలను దోచుకుంటున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 23న ఓ సంఘటన చోటు చేసుకుందని దాంతో తాము అప్రమత్తమయ్యామన్నారు. జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సూచనలతో శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి ప్రణాళికతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచామన్నారు. అనుమానంగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులో తీసుకున్నామన్నారు. ఆతను గుజరాత్ రాష్ట్రంలో అహమదాబాద్‌కు చెందిన గుజరాతి కిషన్(24) అనే వ్యక్తిని అదుపులో తీసుకోగా ఆతని తోడు దొంగ శ్యామ్‌లాల్(30) కూడా అదుపులో తీసుకున్నామన్నారు. వీరు ఓ చిన్నారిని తోడు పెట్టుకొని తెలంగాణ, అంధ్రా లలో మహిళలను మభ్యపెట్టి దోపిడిలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. వీరిది అహమ్మదాబాద్ జిల్లా కుబేర గ్రామమని వీరి మీద ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో ఏడు కేసులు నమోదై ఉన్నట్లు వివరించారు. వీరు జైలు శిక్షణకు కూడా అనుభవించినట్లు రికార్డు ఉందన్నారు. శ్రీకాళహస్తి, చిత్తూరు, కడపలలో మూడు కేసులు నమోదై ఉన్నట్లు సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు. వీరిని అదుపులో తీసుకొని విచారించగా 114 గ్రాముల బంగారు నగలు విలువ సుమారు 11లక్షలు కల్గినది స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి ఓ బాలుని పంపి ఆకలి డ్రామా మొదలెడుతారన్నారు. ఆ బాలుని వద్ద ఎక్కువ మొత్తంలో డబ్బులున్నాయి. ఆతను నిల్వ చేసుకోలేదు. మీ వద్ద ఉన్న బంగారును ఇస్తే ఎక్కువ మొత్తంలో సొమ్ములు అందుతాయని నమ్మబలికి మాయమాటలు చెబుతూ టోకరా వేస్తారని వివరించారు. డివైయస్‌పి నరసింహామూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసామన్నారు. తాను తనతో పాటు కానిస్టేబుల్స్ అరుణ్‌కుమార్, బాబు, క్రాంతి కుమార్, సుధాకర్, నందకుమార్, సుబ్రమణ్యం, నరేష్; రేగన్‌లు కలసి విచారణ ప్రారంభించగా ఓ మైనార్‌బాలుడు దొరికాడని ఆతన్ని పట్టుకొని కూపి లాగితే అసలు నిందితులు పట్టుబడినట్లు వివరించారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరచినట్లు వివరించారు.